మంగళవారం 28-5-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 348, పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD




మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయోచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com




## కొండచరియల కింద నలిగిపోయిన 2000 మంది

వివరాలు 3లో



## రోడ్డు ప్రమాదాలు వేసవిలోనే ఎక్కువ..?

వివరాలు 3లో



## పురుషుడి సాంగత్యం లేకుండానే స్త్రీ తల్లి

వివరాలు 4లో

# చిన్నారులు చనిపోతుంటే కళ్లు మూసుకున్నారా?

### ఇక్కడ పని చేసిన వారంతా ఈ విషాదానికి బాధ్యులే ▪ అగ్నిప్రమాదం కేసుపై గుజరాత్ హైకోర్టు ఆగ్రహం

**ముందడుగు గుజరాత్ :**

గుజరాత్‌లోని రాజ్‌కోట్ అగ్నిప్రమాదం కేసుపై గుజరాత్ హైకోర్టు సోమవారం విచారణ చేపట్టింది. ఈసందర్భంగా రాజ్‌కోట్ మునిసిపల్ కార్పొరేషన్ (ఆర్ఎంసీ) అధికారులపై తీవ్ర స్థాయిలో మండిపడింది. ''మీ పరిధిలో ఇంతటి భవనం ఉందని మీకు తెలియదా? కళ్లు మూసుకున్నారా? ఫైర్ సేఫ్టీ లేకుండా రెండున్నరేళ్లుగా ఇది ఉందని ఎలా చెబుతారు. టికెట్ వసూలు చేసేటప్పుడు వినోద పన్ను గురించి తెలియదా?'' అని జస్టిస్ బైరెన్ వైష్ణవ్, జస్టిస్ దేవాన్‌దేశాయ్‌లతో కూడిన ధర్మాసనం ప్రశ్నించింది. ఆ భవనం ప్రారంభ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ కూడా పాల్గొన్నట్లు మీడియా కథనాలను చూపిస్తూ.. ఆ అధికారులు ఎవరు? వాళ్లంతా ఆడుకోవడానికి అక్కడికి వెళ్లారా? అని ప్రశ్నించారు.



ఆ గేమ్ జోన్ ఏర్పాటైనప్పటి (2021) నుంచి ఈ ప్రమాదం జరిగినంతవరకు రాజ్‌కోట్ కమిషనర్లుగా పనిచేసినవారంతా ఈ విషాదానికి బాధ్యత వహించాల్సిందేనని హైకోర్టు ధర్మాసనం స్పష్టంచేసింది. వారంతా వేర్వేరుగా అఫిడవిట్లు దాఖలు చేయాలని ఆదేశించింది. అనుమతుల కోసం టీఆర్‌పీ గేమ్ జోన్ తమను సంప్రదించలేదంటూ ఆర్ఎంసీ తరపు న్యాయవాది వివరించే సమయంలో హైకోర్టు ధర్మాసనం ఈ ఘాటు వ్యాఖ్యలు చేసింది. ఈ దురదృష్టకర సంఘటన నేపథ్యంలో.. దీనికి ఓ వ్యక్తిని బాధ్యుడిని చేసేందుకు ప్రభుత్వం ముందుకురావాలని, అప్పుడే కఠిన చర్యలు తీసుకోవచ్చని తెలిపింది. పిటిషనర్ చేసిన విన్నపంపై ధర్మాసనం స్పందిస్తూ..'' కఠిన చర్యలు ఎవరు తీసుకుంటారు? రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగంపై మాకు నమ్మకం లేదు. మేం ఆదేశాలిచ్చిన నాలుగేళ్ల తర్వాత కూడా.. ఇలా జరగడం ఇది ఆరోసారి. ప్రాణాలు కోల్పోవడాన్నే వాళ్లు కోరుకుంటారు. ఆ తర్వాత యంత్రాంగాన్ని పురమాయిస్తారు. ఫైర్ సేఫ్టీకి సంబంధించి ఓ పిల్‌పై గతంలో ఇచ్చిన ఆదేశాలపై ఏం చేశారు. నెలలుగా కార్పొరేషన్ ఏం చేస్తోంది' అని హైకోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది.

# మరో ఏడు రోజులు బెయిల్ పొడిగించండి

- తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్నాను
- సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు కేజ్రీవాల్

**ముందడుగు ఢిల్లీ:**

లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా లిక్కర్ స్కాం కేసులో తనకు ఇచ్చిన మధ్యంతర బెయిల్‌ను మరో 7 రోజులు పొడిగించాలని కోరుతూ ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ మరోసారి సుప్రీం **మిగతా 2లో**



# రాహుల్ గాంధీకి తృటిలో తప్పిన ముప్పు

### పాక్షికంగా కుంగిన ఎన్నికల ప్రచార వేదిక

**ముందడుగు బీహార్ :**

బీహార్‌లోని పాలిగంజ్‌లో ఎన్నికల సభ కోసం ఏర్పాటు చేసిన వేదిక పాక్షికంగా కుంగింది. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీకి తృటిలో ముప్పు తప్పింది. సోమవారం లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏర్పాటు చేసిన సభలో ఇండియా బ్లాక్ నేతలు **మిగతా 2లో**



# కవిత బెయిల్ పిటిషన్ వాయిదా

### నేడు మధ్యాహ్నం 12 గంటలకు కోర్టు విచారణ

**ముందడుగు ఢిల్లీ:**

లిక్కర్ కేసులో శిక్ష తీహార్ జైల్లో కవిత బెయిల్ పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు మంగళవారానికి వాయిదా వేసింది సీబీఐ, ఈడీ కేసుల్లో దాఖలైన బెయిల్ పిటిషన్లపై జస్టిస్ స్వర్ణకాంత శర్మ మంగళవారం విచారణ చేపట్టనున్నారు. పిటిషన్‌లో కవిత బెయిల్‌తో పాటు అరెస్టు, డిమాండ్‌ను సైతం సవాల్ చేశారు. కవిత తరపున న్యాయవాది విక్రమ్ చౌదరి వాదనలు వినిపించారు. అరెస్టు సమయంలో కేంద్ర దర్యాప్తు సంస్థలు చట్టాన్ని ఉల్లంఘించాయన్నారు. ఇప్పటికే ఈడీ, సీబీఐ కౌంటర్ అఫిడవిట్లను దాఖలు చేశాయి. నేడు మధ్యాహ్నం 12 గంటలకు కోర్టు విచారణ జరిపే అవకాశం ఉన్నది.



ముందడుగు
మంగళవారం, 28-5-2024, హైదరాబాద్

# మరో ఏడు రోజులు బెయిల్ పొడిగించండి

మొదటిపేజీ తరువాయి

కోర్టును ఆశ్రయించారు. తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్నట్లు పిటిషన్‌లో పేర్కొన్నారు.

మద్యం కుంభకోణం కేసులో అరెస్ట్ అయిన తర్వాత తాను 7 కిలోల బరువు తగ్గినట్లు దేశ అత్యున్నత న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. కీటోన్ స్థాయిలు పెరిగాయని.. అందుకే తాను పీఈటీసీటీ స్కాన్ సహా పలు పరీక్షలు చేయించుకోవాల్సి ఉందన్నారు. ఈ క్రమంలోనే వైద్య పరీక్షలు చేయించుకునేందుకు వీలుగా తన మధ్యంతర బెయిల్ గడువును మరో 7 రోజులు పొడిగించాలని సుప్రీం ధర్మాసనాన్ని తన పిటిషన్‌లో కోరారు.

ఢిల్లీ మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో కేజ్రీవాల్ అరెస్టైన విషయం తెలిసిందే. మార్చి 21న ఈడీ అరెస్టు చేసింది. అప్పటి నుంచి ఆయన జ్యుడీషియల్ కస్టడీలో తీహార్ జైలులో ఉన్నారు. దాదాపు 50 రోజులపాటు జైల్లో ఉన్న ఆయనకు లోక్‌సభ ఎన్నికల ప్రచారం కోసం సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ ఇచ్చింది. జూ 1 వరకూ బెయిల్ మంజూరు చేసింది. ఇక జూన్ 2న ఆయన లొంగిపోవాల్సి ఉంది.

# నన్ను తప్పుగా అర్థం చేసుకోకండి

**నాపై తప్పుడు కేసులు బనాయించారు ▪ కేసు విచారణకు సహకరిస్తాను ▪ జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ ప్రకటన**



**ముందడుగు కర్ణాటక:**

లైంగిక దౌర్జన్యాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రస్తుతం పరారీలో ఉన్న జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. తాను కేసు విచారణకు సహకరిస్తానని, శుక్రవారం (మే 31న) 'సిట్' ముందు వ్యక్తిగతంగా హాజరవుతానంటూ తొలిసారి ఓ వీడియో సందేశం విడుదల చేశారు. ''నన్ను తప్పుగా అర్థం చేసుకోకండి. నాపై తప్పుడు కేసులు బనాయించారు. ఇవన్నీ రాజకీయ కుట్రలో భాగమే. ఇప్పటికే కుంగుబాటుకు లోనయ్యాను. అయితే, న్యాయవ్యవస్థపై నమ్మకం ఉంది'' అని తెలిపారు. తన ఆచూకీ చెప్పనందుకు.. తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు, జేడీఎస్ శ్రేణులకు ప్రజ్వల్ క్షమాపణలు చెప్పారు. ''విదేశాల్లో ఎక్కడున్నానో సరైన సమాచారం ఇవ్వనందుకు కుటుంబసభ్యులకు, కుమారస్వామికి, పార్టీ కార్యకర్తలకు క్షమాపణలు చెబుతున్నా. ఏప్రిల్ 26న పోలింగ్ ముగిసినప్పుడు నాపై ఎటువంటి కేసు లేదు. ఆ తర్వాత రెండు, మూడు రోజులకు ఆరోపణలు వెల్లువెత్తినట్లు చూశాను'' అని పేర్కొన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఇతర సీనియర్ నాయకులూ తనపై వచ్చిన ఆరోపణలపై బహిరంగంగా మాట్లాడారని, ఇది రాజకీయ కుట్రేనని ఆరోపించారు.

# రాహుల్ గాంధీకి తృటిలో తప్పిన ముప్పు

మొదటిపేజీ తరువాయి

పాల్గొన్నారు. రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్జేడీ) నేతలు తేజస్వీ యాదవ్, మిసా భారతితో కలిసి రాహుల్ గాంధీ స్టేజ్ పైకి చేరుకున్నారు. ఆ వేదికపై అప్పటికే ఎక్కువ మంది నాయకులు ఉన్నారు. ఈ నేపథ్యంలో స్టేజ్ పాక్షికంగా కూలింది. దీంతో మిసా భారతి చేతులు పట్టుకుని నడిచిన రాహుల్ గాంధీ కొంత బ్యాలెన్స్ కోల్పోయారు. అయితే వెంటనే ఆయన తేరుకున్నారు. రాహుల్ గాంధీ సెక్యూరిటీ సిబ్బంది వెంటనే స్పందించారు. కొద్దిగా కుంగిన వేదిక వద్ద ఉన్న ఆయనకు సహాయం కోసం ముందుకు వచ్చారు. స్టేజ్ నుంచి దిగిపోవాలని రాహుల్‌కు సూచించారు. అయితే తనకు ఏమీ కాలేదని, కంగారు పడవద్దని సెక్యూరిటీ గార్డులకు సూచించారు. అనంతరం అదే వేదికపై రాహుల్ గాంధీ ప్రసంగించారు. ప్రధాని మోదీపై మండిపడ్డారు. అయితే పాక్షికంగా కుంగిన వేదిక వద్ద రాహుల్ గాంధీ అదుపుతప్పిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

# తెలంగాణ రాష్ట్రంలోకి కొత్త బీర్లు

## పవర్ 10000, బ్లాక్ ఫోర్ట్, హంటర్, వుడ్ పీకర్ బీర్లు

**ముందడుగు తెలంగాణ:**




తెలంగాణ రాష్ట్రంలో బీర్ల కొరత ఏర్పడినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. మద్యం దుకాణాల్లో బీర్లను అందుబాటులో ఉంచాలని పలువురు ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదులు చేసిన వార్తలను కూడా చేశాం. అయినా కూడా బీర్లు అందుబాటులో లేవు. అయితే తెలంగాణలోకి కొత్త బీర్లు రాబోతున్నారు. రాష్ట్రంలో తమ బీర్ బ్రాండ్‌లను సరఫరా చేయడానికి సోమ్ డిస్టిలరీస్ అనుమతి పొందింది. ఇక పవర్ 10000, బ్లాక్ ఫోర్ట్, హంటర్, వుడ్ పీకర్ బీర్లు అందుబాటులోకి రానున్నాయి. తెలంగాణలో రూ. 5000 కోట్ల లిక్కర్ స్కాం జరిగినట్లు వార్తలు వచ్చాయి. గత రెండు, మూడు నెలలుగా బీర్లు దొరకకపోవడం వెనుక భారీ కుట్ర జరుగుతున్నట్లు పలు మీడియా సంస్థలు చెప్పుకొచ్చిన సంగతి తెలిసిందే. కమీషన్ బట్టి తెలంగాణలో కొత్త బ్రాండ్లకు గేట్లు తెరిచే అవకాశం ఉందని వార్తలు వచ్చాయి. ఎన్నికల ఫలితాల తర్వాత కొన్ని ప్రముఖ బ్రాండ్లు కనుమరుగై కొత్త బ్రాండ్లు వచ్చే అవకాశ ఉందని రాసుకొచ్చారు. రాష్ట్రంలో ఇప్పటికే మద్యం కొరత సృష్టించారు. ఇది సాకుగా చూపుతూ కొన్ని కొత్త బ్రాండ్లను పరిచయం చేసేందుకు, వాటి ద్వారా భారీగా కమీషన్ పొందేందుకు ప్రభుత్వం ప్లాన్ చేసినట్లు సమాచారం.

# నిందితుడి బ్లడ్ రిపోర్ట్ మార్చేసిన వైద్యులు

**మరో వ్యక్తి నమూనాలను పెట్టినట్లు సమాచారం ▪ పుణె టీనేజర్ ర్యాష్ డ్రైవింగ్ కేసులో అనుకోని ట్విస్ట్**



**ముందడుగు మహారాష్ట్ర:**

మహారాష్ట్రలోని పుణెలో టీనేజర్ పోర్ష్ కారు ర్యాష్ డ్రైవింగ్ కేసులో అనుకోని ట్విస్ట్‌ను దర్యాప్తు అధికారులు గుర్తించారు. ప్రధాన నిందితుడైన మైనర్ రక్త నమూనా పరీక్ష నివేదికను ఇద్దరు వైద్యులు మార్చేసినట్లు గుర్తించారు. తాజాగా వారిపై చర్యలు మొదలుపెట్టారు. సాసూన్ ఆస్పత్రికి చెందిన డాక్టర్ అజేయ్ తావ్‌రే, డాక్టర్ శ్రీహరి హార్నూర్‌ను పుణె క్రైం బ్రాంచి పోలీసులు అరెస్టు చేశారు. పుణెలోని ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్ తావ్‌రే ఫోరెన్సిక్ విభాగానికి అధిపతిగా పనిచేస్తున్నారు. ప్రమాదం జరిగిన మొదట్లో అబ్జర్వేషన్ హోమ్‌లో ఉన్న నిందితుడు (మైనర్) రక్త నమూనాల్లో ఎటువంటి ఆల్కహాల్ ఆనవాలు లేవని నివేదిక ఇచ్చారు. కానీ, పోలీసులు అనుమానంతో సీసీటీవీ దృశ్యాలను పరిశీలించగా నిందితుడు మిత్రులతో కలిసి మద్యం తాగినట్లు ధ్రువీకరించుకొన్నారు. దీంతో డాక్టర్లను అదుపులోకి తీసుకొన్నారు. రక్త పరీక్షల సమయంలో మైనర్ నమూనాలను పారేసి.. మరో వ్యక్తి నమూనాలను వీరు అక్కడ పెట్టినట్లు అనుమానిస్తున్నారు. ఇప్పటికే ఈ కేసు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించడంతో పుణె పోలీసులు కూడా తీవ్రంగా పరిగణించారు. దర్యాప్తు సమయంలో నగర కమిషనర్ అమితేష్ కుమార్ మాట్లాడుతూ ''ఇదేదో మద్యం మత్తులో చేసిన యాక్సిడెంట్ కేసు కాదు. నిందితుడైన మైనర్‌కు తాను పార్టీ చేసుకొంటూ ఆల్కహాల్ తాగిన విషయం స్పష్టంగా తెలుసు. అలాంటి పరిస్థితుల్లో కారు నడిపితే రోడ్డుపై వారి ప్రాణాలకు ప్రమాదమన్న విషయంపై అతడికి పూర్తి అవగాహన కూడా ఉంది'' అని పేర్కొన్నారు.

ముందడుగు
మంగళవారం, 28-5-2024, హైదరాబాద్

# కొండచరియల కింద నలిగిపోయిన 2000 మంది

- శిథిలాల కిందే ఉండిపోయిన మరికొంతమంది
- 200 చదరపు కిలోమీటర్ల మేరకు బీభత్సం
- ఐరాసకు వెల్లడించిన పాపువా న్యూగినీ

**ముందడుగు జాతీయం:**

కొండచరియలు 2000మందికి పైగా ప్రాణాలను బలితీసుకుంది. పాపువా న్యూగినీలో కొండచరియలు విరిగి పడిన ఘటనలో సజీవ సమాధి అయిన వారి సంఖ్య వేలల్లోకి మారింది. ఈ విషయాన్ని అక్కడి ప్రభుత్వం ఐరాసకు వెల్లడించింది. ''కొండచరియలు విరిగి పడిన ఘటనలో 2,000 మంది ప్రజలు సజీవ సమాధి అయ్యారు'' అని ఆ దేశంలోని నేషనల్ డిజాస్టర్ సెంటర్‌నుంచి ఐరాస ఆఫీస్‌కు సమాచారం వెళ్లింది. ఈ మేరకు సోమవారం ఉదయం లేఖను ఆ కార్యాలయానికి పంపింది. దాదాపు 200 చదరపు కిలోమీటర్ల పరిధిలో ఈ బీభత్సం సంభవించింది. కొన్ని చోట్ల 8 మీటర్ల ఎత్తున శిథిలాలు కుప్పలు పడినట్లు తెలుస్తోంది. ఇప్పటికీ చాలా చోట్ల కొండచరియలు విరిగిపడుతుండటంతో.. శిథిలాల కిందే ఉండిపోయిన క్షతగాత్రుల ప్రాణాలకు, సహాయక



చర్యల్లో పాల్గొంటున్న బృందాలకు సవాల్‌గా మారింది. సహాయక చర్యల్లో పాల్గొనేందుకు సైన్యం, ఇతర బృందాలను కూడా సిద్ధం చేస్తున్నారు. మిత్రదేశాలు అందించే సాయాన్ని డిజాస్టర్ సెంటర్ ద్వారా సమన్వయం చేసుకొంటామని అక్కడి ప్రభుత్వం పేర్కొంది.

శుక్రవారం తెల్లవారుజామున ఈ దేశంలోని ఎంగా ప్రావిన్స్‌లోని యంబాలి గ్రామంపై మౌంట్ ముంగాల కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ దెబ్బకు ఆ ప్రావిన్స్‌లో చాలా ప్రాంతాలు తుడిచి పెట్టుకుపోయాయి. తొలుత పదుల సంఖ్యలో ఇళ్లు నేలమట్టమయ్యాయని భావించారు. కానీ, భారీ భవనాలు, పంటలు కూడా వీటి కింద చిక్కుకుపోయినట్లు తేలింది. ఈ ప్రమాదం ఆ దేశ ఆర్థిక పరిస్థితిపై కూడా ప్రతికూల ప్రభావం చూపించే అవకాశం ఉంది. పోర్గెర మైన్‌కు వెళ్లే ప్రధాన జాతీయ రహదారి ఈ ఘటనలో తీవ్రంగా దెబ్బతింది. ఫలితంగా రవాణాకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

# రాష్ట్రానికి వస్తున్న 20 కంపెనీల బలగాలు

## ఎన్నికల ప్రధాన అధికారి ముకేశ్‌కుమార్ మీనా



**ముందడుగు ఆంధ్రప్రదేశ్:**

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ పోలింగ్ అనంతరం జరిగిన అల్లర్లు, దాడులను దృష్టిలో ఉంచుకొని కౌంటింగ్ నాటికి రాష్ట్రానికి 20 కంపెనీల బలగాలను రప్పిస్తున్నట్లు ఏపీ ఎన్నికల ప్రధాన అధికారి ముకేశ్‌కుమార్ మీనా తెలిపారు. కౌంటింగ్ రోజు, ఆ తర్వాత కూడా ఎలాంటి ఘర్షణలు చోటు చేసుకోకుండా పటిష్ఠ భద్రత ఏర్పాట్లు చేశామన్నారు. నాగార్జున యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లను సోమవారం ఆయన పరిశీలించారు. మూడంచెల భద్రత వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులు, ఏజెంట్లు భౌతికంగా రెండు పర్యాయాలు స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించే అవకాశం కల్పించినట్లు చెప్పారు. పల్నాడులో పరిస్థితులు అదుపులోనే ఉన్నాయని, కేవలం పోలింగ్ తర్వాత మాత్రమే అల్లర్లు జరిగాయని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా కౌంటింగ్ నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

# రోడ్డు ప్రమాదాలు వేసవిలోనే ఎక్కువ..?

## కారణాలు తెలిపిన రవాణా నిపుణులు ▪ గతేడాది జరిగిన రోడ్డు ప్రమాదాలు 412432

**ముందడుగు ప్రత్యేకం:**

దేశంలో రోడ్డు ప్రమాదాల సంఖ్య రోజురోజుకు భారీగా పెరిగిపోతుంది. రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం, గతేడాది మనదేశంలో 412432 రోడ్డు ప్రమాదాల్లో 16,849 మంది మరణించారు. మే, జూన్‌లలో అత్యధికంగా రోడ్డు ప్రమాదాలు జరిగాయి. మేలో 43307, జూన్‌లో 39432 రోడ్డు ప్రమాదాలు నమోదయ్యాయి. ఇందులో మేలో 16791 మంది, జూన్‌లో 14762 మంది ప్రాణాలు కోల్పోయారు.

### ఎండాకాలం పెరగడానికి కారణం

పొగమంచు ఎక్కువగా ఉండే జనవరిలో 37040 రోడ్డు ప్రమాదాల్లో



13677 మంది ప్రాణాలు కోల్పోయారు. ఉత్తర భారతదేశంలో జూలై నుండి సెప్టెంబర్ వరకు వర్షాలు కురుస్తాయి. ఈ కాలంలో జూలైలో ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరిగాయి. 37228 రోడ్డు ప్రమాదాల్లో 12266 మంది ప్రాణాలు కోల్పోయారు. గణాంకాల ప్రకారం, పొగమంచు, వానాకాలంలో కంటే ఎండాకాలంలోనే ఎక్కువ ప్రమాదాలు జరుగుతాయి. రోడ్డు ప్రమాదాలు ఎక్కువ కావడం వెనుక కారణాలేంటని రవాణా నిపుణులు చెబుతున్నారు.

### ఎండాకాలంలో సందర్శనలు ఎక్కువ

రోడ్లపై ట్రాఫిక్ ఎక్కువగా ఉన్నప్పుడు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని సెంట్రల్ రోడ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సిఆర్ఆర్ఐ) ప్రిన్సిపల్ సైంటిస్ట్ ఎస్‌కె పాండే చెబుతున్నారు. పాఠశాలలకు సమ్మర్ హాలిడేస్ ప్రారంభమయిన తర్వాత ప్రజలు గ్రామాలకు లేదా సందర్శనల కోసం వెళతారు. ఈ విధంగా రోడ్డుపై ట్రాఫిక్ పెరిగి రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. అదే సమయంలో, పొగమంచు, వర్షంలో తక్కువ సంఖ్యలో ప్రజలు బయటకు వెళతారు.. జాగ్రత్తగా డ్రైవ్ చేస్తారు, దీని వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు తక్కువ ఉంటుందన్నారు.

# సామాజిక మేధస్సుతోనే వ్యక్తి ఉన్నతి

## చిరస్మరణీయ అనుభవాలు అందించిన బూట్ క్యాంప్

**ముందడుగు హైదరాబాద్:**

సాధికారత, సుసంపన్నంతో పాటు భవిష్యత్తు అవకాశాల కోసం బూట్‌క్యాంప్ ఒక ఆలోచనను రేకెత్తించింది. హైదరాబాద్‌లోని నానక్‌రామ్‌గూడలోని వరల్డ్ ట్రేడ్ సెంటర్‌శంషాబాద్ (మధ్యంతర కార్యాలయం)లో బూట్‌క్యాంప్ మూడు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ పరివర్తన మూడురోజుల ఈవెంట్‌లో స్పీకర్ల శ్రేణి, ఆకర్షణీయమైన వర్క్‌షాప్‌లు మరియు చిరస్మరణీయ అనుభవాలు అందించారు.

డా. ఉషా యనమండ్ర రచించిన "SIది సోషల్ ఆల్కెమీ: క్రాఫ్టింగ్ సక్సెస్ త్రూ సోషల్ ఇంటెలిజెన్స్" అనే పుస్తక ప్రారంభోత్సవంతో పాటు సాధికారతతో కూడిన పలు అంశాలను మొదటి రోజు



అందించారు. బూట్‌క్యాంప్‌లోని ముఖ్యాంశాలు "ఎంపవర్డ్ కమ్యూనికేషన్"పై రాయబారి డాక్టర్ దీపక్ వోహ్రా, "బిల్డింగ్ ఎ డిజిటల్ ఐడెంటిటీ"పై ప్రసన్న ఎం నోరి, "సైబర్ సేఫ్టీ అండ్ రెసిలెన్స్"పై భాను మూర్తి వై మరియు శ్రీ చరణ్ లక్కరాజు వంటి ప్రఖ్యాత నిపుణుల స్ఫూర్తిదాయకమైన సెషన్‌లు ఆకట్టుకున్నాయి. అపారమేధ సంపత్తి కలిగిన స్పీకర్‌లు, ఇంటరాక్టివ్ వర్క్‌షాప్‌లు మరియు వినూత్న ప్రకటనలతో, "సోషల్ ఇంటెలిజెన్స్ బూట్‌క్యాంప్ 2024" ఆకట్టుకుంది. శిక్షణలో పాల్గొన్న వారికి అతిథులచే ఘనంగా సర్టిఫికేట్స్ ప్రధానం చేశారు.

ముందడుగు
మంగళవారం, 28-5-2024, హైదరాబాద్



## నక్సలైట్లు బెదిరించారు..

# పద్మశ్రీ వెనక్కి ఇచ్చేస్తాను

### వైద్య అభ్యాసకుడు హేమచంద్ మాంఝీ కీలక నిర్ణయం

**ముందడుగు జాతీయం:**

పద్మశ్రీ అవార్డు గ్రహిత, సాంప్రదాయ వైద్య అభ్యాసకుడు హేమచంద్ మాంఝీ కీలక నిర్ణయం తీసుకున్నారు. తనకు ఇచ్చిన పద్మశ్రీ అవార్డును తిరిగి ఇస్తున్నట్లు ప్రకటించారు. తనకు నక్సలైట్ల నుంచి బెదిరింపులు వస్తుండటంతో అవార్డును తిరిగి ఇచ్చేస్తానని చెప్పారు. మే 27న తనకు నక్సలైట్ల నుంచి బెదిరింపు కాల్స్ వచ్చినట్లుగా ఆయన తెలిపారు. తన కుటుంబ సభ్యులతో మాట్లాడిన తర్వాత పద్మశ్రీ అవార్డును తిరిగి ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు హేమచంద్ తెలిపారు. అంతేకాకుండా వైద్యరాజ్‌గా ప్రసిద్ధి చెందిన మాంఝీ తన అభ్యాసాన్ని కూడా విరమించుకుంటానని చెప్పారు. గతంలో తన మేనకోడలు కోమల్ మాంఝీపై తప్పుడు ఆరోపణలు చేసి నక్సలైట్లు హత్య చేశారని.. అప్పటినుంచి తన కుటుంబం భయం నీడలో బతుకుతున్నామని ఆయన చెప్పారు. నక్సలైట్ల బెదిరింపుల క్రమంలో ప్రస్తుతం హేమచంద్ కుటుంబానికి స్థానిక పోలీసులు భద్రత కల్పించారు.

తాను చేసిన సేవలకు పద్మశ్రీ అక్కర్లేదని... తనకు ఓ ఇంటిని అందించాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు హేమచంద్ మాంఝీ, 72 ఏళ్ల మాంఝీ ఐదు దశాబ్దాలకు పైగా ఛత్తీస్‌గఢ్ లోని ప్రజలకు సాంప్రదాయ ఆరోగ్య సేవలను అందించారు. ఆయన అందించిన సేవలకు గానూ కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డుతో సత్కరించింది.రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఆయన పద్మశ్రీ అవార్డును స్వీకరించారు.

## జమ్మూకశ్మీర్‌లో గత 35 ఏళ్లలో

# అత్యధిక పోలింగ్

### 5 లోక్‌సభ స్థానాల్లో కలిపి 58.46 శాతం నమోదు

**ముందడుగు జాతీయం:**

జమ్మూకశ్మీర్‌లో గత 35 ఏళ్లలో అత్యధిక పోలింగ్ ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో నమోదైనట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. 5 లోక్‌సభ స్థానాల్లో కలిపి 58.46 శాతం ఓట్లు పోలయ్యాయని తెలిపింది. 2019తో పోలిస్తే కశ్మీర్ లోయలో ఏకంగా 30 శాతం ఓటింగ్ పెరిగినట్లు, అభ్యర్థుల సంఖ్యలో కూడా 25 శాతం పెరుగుదల నమోదైనట్లు చెప్పింది. ఓటర్ల నుంచి ఈ స్థాయిలో మద్దతు లభించడం అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సానుకూల పరిణామమని భారత ఎన్నికల ప్రధాన అధికారి రాజీవ్‌కుమార్ పేర్కొన్నారు. కశ్మీర్ లోయలోని మూడు స్థానాల్లో కలిపి 50.86 శాతం ఓటింగ్ నమోదు కావడం.. ప్రజాస్వామ్య ప్రక్రియపై స్థానిక ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని



ప్రతిబింబిస్తోందని ఎన్నికల సంఘం తెలిపింది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో కేవలం 19.16 శాతం ఓట్లు నమోదు కాగా.. ఈసారి 30 శాతం పెరిగినట్లు వెల్లడించింది. కశ్మీర్ లోయలోని శ్రీనగర్‌లో 38.49, బారాముల్లాలో 59.1, అనంత్‌నాగ్‌రాజౌరీలో 54.84 శాతం ఓట్లు పోలయ్యాయి. ఈ మూడుచోట్ల గత మూడు దశాబ్దాల్లో ఇవే అత్యధికం. జమ్మూ ప్రాంతంలోని ఉధంపుర్‌లో 68.27, జమ్మూలో 72.22 శాతం పోలింగ్ నమోదైంది.

# పురుషుడి సాంగత్యం లేకుండానే స్త్రీ తల్లి

- వైద్య శాస్త్రంలో 5 ప్రసిద్ధ పద్ధతులు
- పుట్టిన పిల్లలు కూడా పూర్తి ఆరోగ్యంగానే
- సైన్స్ చెబుతున్న వాస్తవాలు ఇవే

**ముందడుగు ప్రత్యేకం:**

ఒక స్త్రీ బిడ్డకు జన్మ ఇవ్వాలంటే స్త్రీ మరియు పురుషుడికి పెళ్లి అయ్యాక వారి మధ్య సంపర్కం అవసరం. కానీ ఇప్పుడు సైన్స్ కొత్త విషయాలు చెప్తుంది. స్త్రీలు గర్భం దాల్చడానికి పురుషుల సాంగత్యం అస్సలు అవసరం లేదని అంటుంది. సరళమైన భాషలో చెప్పాలంటే ఏ స్త్రీ అయినా ఏ పురుషుడితో సంబంధం లేకుండా కూడా తన బిడ్డకు తల్లిగా మారవచ్చు. సైన్స్‌లో ఈ పురోగతి ఫలితం ఏమిటంటే.. ఈ రోజుల్లో ఒంటరి తల్లులు మరియు స్వలింగ సంపర్కుల పిల్లల గురించి మనం చాలా వార్తలు వింటున్నాము. దీనిపై వైద్య శాస్త్రంలో 5 ప్రసిద్ధ పద్ధతులు ఉన్నాయి.. దీని ద్వారా స్త్రీ పురుషుడితో సంబంధం లేకుండా బిడ్డకు జన్మనిస్తుంది. ఈ పద్ధతులు పాటించడం వల్ల పుట్టిన పిల్లలు పూర్తిగా ఆరోగ్యంగా ఉంటారని వైద్యులు చెబుతున్నారు.

వైద్యులు కొన్ని సందర్భాల్లో బిడ్డను గర్భం ధరించేంత ఆరోగ్యంగా ఉన్నారని.. అయితే ఆమె గుడ్లు ఫలదీకరణం సమస్య అని వైద్యులు చెబుతున్నారు. అటువంటి పరిస్థితిలో, IVF అంటే ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్ చికిత్స పెద్ద పాత్ర పోషిస్తుంది. IVF దేశవ్యాప్తంగా అనేక వంధ్యత్వ క్లినిక్‌లలో అందుబాటులో ఉంది. ఈ పద్ధతిలో, గుడ్ల ఉత్పత్తిని ప్రోత్సహించడానికి స్త్రీకి ఔషధం ఇవ్వబడుతుంది. అప్పుడు గుడ్లు బయటకు తీయబడతాయి. అది స్త్రీ ఎంపిక చేసిన స్పెర్మ్‌లతో ఫలదీకరణం చేయబడిన అటువంటి పరిస్థితులలో ఉంచబడుతుంది. ఫలదీకరణం తర్వాత, పిండం ఏర్పడినప్పుడు, గర్భాశయం కాథెటర్‌ను ఉపయోగించి తెరవబడుతుంది మరియు పిండాన్ని లోపలికి చొప్పించబడుతుంది.



### టర్కీ బాస్టర్ టెక్నిక్ ఎలా సహాయపడుతుంది?

టర్కీ బాస్టర్ టెక్నిక్ గురించి చాలా కొద్ది మందికి మాత్రమే తెలుసు. ఇది శీఘ్ర మరియు సులభమైన పద్ధతిగా పరిగణించబడుతుంది. ఈ పద్ధతిని స్వలింగ సంపర్కులు ఎక్కువగా ఉపయోగిస్తారు. ఇది కృత్రిమ గర్భధారణతో పోల్చబడింది. దాని దశలు చాలా సులభం. స్పెర్మ్ తెలిసిన వ్యక్తి లేదా స్పెర్మ్ బ్యాంక్ నుండి పొందబడుతుంది. అప్పుడు శుక్రకణాన్ని సేకరించేందుకు ఇన్సెమినేషన్ సిరంజిని ఉపయోగిస్తారు. దీని తర్వాత మహిళ యొక్క ప్రైవేట్ భాగంలోకి ఒక కీని చొప్పించారు. అప్పుడు స్పెర్మ్‌లు అంతర్గతంగా గర్భం దాల్చడానికి అనుమతించబడతాయి. ఈ ప్రక్రియలో అస్సలు నొప్పి ఉండదు.

### యుటెరస్ టెక్నిక్‌లో ఇన్‌సెమినేషన్ అంటే ఏమిటి?

యూట్రస్ టెక్నిక్‌లో ఇన్‌సెమినేషన్ చాలా అధునాతనమైనది. దీనిని IUI అంటారు, ఇది టర్కీ బాస్టర్ టెక్నిక్ మరియు IVF కలయిక. మగ భాగస్వామి యొక్క సంతానోత్పత్తి స్థాయి తక్కువగా ఉన్నప్పుడు దీనిని సాధారణంగా జంటలు ఎంచుకుంటారు. అలాగే బిడ్డకు జన్మనివ్వాలనుకునే ఒంటరి ఆరోగ్యకరమైన మహిళలు కూడా ఈ పద్ధతిని ఉపయోగిస్తారు. ఇందులో అండోత్సర్గము సమయంలో గుడ్డు గర్భాశయానికి చేరుకుంటుంది. అప్పుడు స్పెర్మ్ ద్వారా ఫలదీకరణం కోసం వేచి ఉంది. IUIలో, స్త్రీ దాత లేదా బ్యాంకు నుండి స్పెర్మ్‌ను ఏర్పాటు చేస్తుంది. అప్పుడు వైద్య నిపుణుడు శుక్రకణాన్ని కాథెటర్ సహాయంతో గర్భాశయంలోకి, గుడ్లకు దగ్గరగా ప్రవేశపెడతాడు. అయితే ప్రక్రియ విజయవంతం అయ్యే వరకు ఈ మొత్తం చక్రం పునరావృతం కావాలి.

### స్ప్లాష్ ప్రెగ్నెన్సీలో ప్రెగ్నెన్సీ ఎలా జరుగుతుంది?

కొంతమంది పురుషులకు అంగస్తంభన సమస్యలు, స్త్రీలకు వాజినిస్మస్ వంటి సమస్యలు ఉంటాయి. దీంతో వీరిద్దరూ కలసి రావడం కష్టంగా మారింది. అయినప్పటికీ స్త్రీ సులభంగా గర్భవతి అవుతుంది. శుక్రకణాలతో కొద్దిపాటి స్పర్శ వల్ల కూడా స్త్రీ గర్భం దాల్చుతుందని వైద్య శాస్త్రం చెబుతోంది. స్ప్లాష్ ప్రెగ్నెన్సీ టెక్నిక్‌లో, స్ఖలనం అనేది స్త్రీ భాగస్వామి ఆమె ప్రైవేట్ పార్ట్‌ల దగ్గర జరుగుతుంది. ఈ పద్ధతిలో విజయానికి హామీ లేదు.

### సరోగేట్ బేబీలో పరిచయం అవసరం లేదు

దంపతుల్లో ఒకరు లేదా ఇద్దరూ సంతానం లేని సమయంలో లేదా బిడ్డను ఉంచడానికి స్త్రీ గర్భాశయం బలంగా లేనప్పుడు సరోగసీని ఆశ్రయిస్తారు. ఇందులో దంపతులు తమ బిడ్డను కలిగి ఉండవచ్చు. ఈ టెక్నిక్‌లో, ఫలదీకరణం మరియు పిండం ఏర్పడే ప్రక్రియ ప్రారంభమయ్యేలా ల్యాబ్‌లో పురుషుల స్పెర్మ్ మరియు స్త్రీ అండాలను కలుపుతారు. ఈ పిండం మీకు నచ్చిన సర్రోగేట్ తల్లి గర్భాశయంలో ఉంచబడుతుంది.. వారు గర్భం మొత్తం బిడ్డను మోస్తారు. అప్పుడు పుట్టిన తర్వాత ఆమె అతన్ని తన నిజమైన తల్లిదండ్రులకు అప్పగిస్తుంది.

# రూ.10 వేలకే ప్రాణం తీసిన లోన్ యాప్

### వేధింపులకు ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

**ముందడుగు :**

ఇంట్లో తెలియకుండా లోన్ యాప్‌లో రూ.10వేల రుణ తీసుకున్న ఇంజినీరింగ్ విద్యార్థి లోన్ యాప్ నిర్వాహకుల వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాద సంఘటన గుంటూరు జిల్లా తాడేపల్లిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడకు చెందిన మురికింటి వంశీ(22) ఇంజినీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్నాడు. ఈ విషయాన్ని ఇంట్లో చెప్పేందుకు భయపడిన విద్యార్థి వంశీ.. ఈనెల 25న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తాను చనిపోతున్నానంటూ కుటుంబ సభ్యులకు మెసేజ్ పెట్టాడు. ఆ తర్వాత నుంచి ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు రెండు రోజులుగా గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో తాడేపల్లిలో కృష్ణా నది వద్ద మొబైల్ ఫోన్, చెప్పులు, బైక్ కనిపించాయి. నదిలో గాలింపు చేపట్టగా వంశీ మృతదేహాన్ని గుర్తించారు. తండ్రి పిర్యాదు మేరకు తాడేపల్లి పోలీసులు మృతదేహాన్ని బయటకు తీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

